


## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## బహుమతి పొందిన ఉత్తమ నవల
## (గత సంచిక తరువాయి)

**వార్నర్ ఆ పుస్తకం తీసుకుని** కౌంటర్ ఇంటెలిజెన్స్ ఆఫీసుకు బయలుదేరాడు. వెళ్తూ, వెళ్తూ, “సంతోష్‌కి అప్పచెప్పిన పని పూర్తయ్యాక వెళ్ళిపొమ్మని చెప్పు…” అని సార్జెంటుకు చెప్పి వెళ్ళి పోయాడు.

సంతోష్ పని ముగించుకుని తన ఇంటికి బయలుదేరాడు. వంచిన నడుము ఎత్తకుండా పనిచేయటంతో ఒళ్లంతా నొప్పులు పుడుతోంది.

ఇంటికి చేరిన అతను స్నానం చేసి అన్నం వండుకుని తిన్నాడు. ఇలా తిన్నాడో, లేదో అలా నిద్ర ముంచుకు రాసాగింది. ఈ రాత్రికి రేడియో ట్రాన్స్‌మిషన్ ఆపి నిద్ర పోదామా అనుకున్నాడు. కానీ ఈరోజు అతనికి లభించిన సమాచారం అత్యంత ముఖ్యమైనది. అందుకే అర్ధరాత్రి వరకు అతి బలవంతం మీద నిద్రను ఆపుకుని సైకిల్ మీద రేడియో ట్రాన్స్‌మీటర్ పెట్టుకుని రహస్య ప్రదేశానికి బయలుదేరాడు.

ఆ రోజుల్లో రేడియో ట్రాన్స్‌మిషన్ మోర్స్ కోడ్‌లో జరిగేది. ఒన్ టైమ్ ప్యాడ్‌ని ఉపయోగించి సమాచారాన్ని కోడెడ్ లాంగ్వేజిలోకి మార్చి ప్రసారం చేసేవాళ్లు. ప్రసారం శత్రు దేశం నుండి జరుగుతున్నందున తాము పంపుతున్న సమాచారం శత్రువుల నిఘా నుండి తప్పించుకోలేదని అందరికీ తెలుసు. అయితే ఒన్ టైమ్ ప్యాడ్ ఉపయోగం ఏమిటంటే ప్రతి రోజూ ఉపయోగించే కోడ్ మారుతుంది. సమాచారాన్ని ప్రసారం చేసే వ్యక్తి వద్ద, సమాచారాన్ని రిసీవ్ చేసుకునే వ్యక్తి వద్ద ఆ బుక్ ఉంటే తప్ప కోడ్ లంగ్వేజిలో పంపే సమాచారాన్ని తెలుసుకోవటం సాధ్యం కాదు.

ప్రసారాలు పంపే గూఢచారులను పట్టుకోవటం కష్టమేమో కానీ, వారు పంపే సమాచారాన్ని తెలుసుకోవటం కష్టం ఏమీ కాదు. కానీ ఆ సందేశాలన్నీ కోడ్ లాంగ్వేజీలో ఉండటం వలన కోడ్ బుక్ ఉంటే తప్ప దానిని డీ కోడ్ చేయటం

ఎవరి వల్లా కాదు. ఇలా అందుకున్న ప్రసారాల కోడ్ బ్రేక్ చేయటానికి నిపుణులు నిరంతరంగా ప్రయత్నిస్తూ ఉండేవారు. ఒకవేళ అతి కష్టం మీద ఒక సందేశాన్ని డీ కోడ్ చేయగలిగినా తిరిగి మరుసటి రోజు ఉపయోగించే కోడ్ అదే అయి ఉండదు. తిరిగి కోడ్ బ్రేకింగ్ పనిని మొదటి నుండి మొదలు పెట్టాలి. అందుకే ఆ పనిలో ఎవరూ పెద్దగా సఫలం అయిన దాఖలాలు లేవు.

ఈ పనులన్నీ కలకత్తాలోని ఫోర్ట్ విలియమ్‌లో ఉన్న కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగంలో జరిగేవి. ప్రస్తుతం అక్కడ కూర్చుని ఉన్నాడు విలియమ్. సిగరెట్ మీద సిగరెట్ తాగుతూ నిద్రను ఆపుకుంటున్నాడతను.

ఇంతలో అక్కడ ఉన్న ఉద్యోగుల్లో కలకలం మొదలయింది. కలకత్తాలోని ఏదో ప్రదేశం నుండి ఎవరో సందేశం పంపుతున్నారు.

కౌంటర్ ఇంటెలిజెన్స్ ఉద్యోగులు వెంటనే రియాక్ట్ అయ్యారు. రహస్యంగా పంపుతున్న సమాచారాన్ని కాపీ చేశారు. మామూలుగా అయితే పని పూర్తి అయిన తరువాత కోడ్‌లో ఉన్న ఆ సమాచారాన్ని కోడ్ బ్రేకర్ల వద్దకు పంపుతారు. అలా తీసుకు వెళ్లబోతున్న వ్యక్తిని ఆగమన్నట్లు సైగ చేశాడు వార్నర్. "ఈ కోడ్ ఉపయోగించి బ్రేక్ చేయటానికి ప్రయత్నించండి..." అంటూ తన జేబులో నుండి ఒక కాగితం తీసి ఇచ్చాడు. అది సంతోష్ ఇంటిలో నుండి తీసుకువచ్చిన ఒన్ టైమ్ ప్యాడ్‌లో ఉన్న ఆ రోజుకు సంబంధించిన కోడ్ సీక్వెన్స్.

ఆ కోడ్ సీక్వెన్స్ ఉపయోగించి రెండు నిమిషాల్లో ఆ సమాచారం డీ కోడ్ చేయటం పూర్తయింది. డీ కోడ్ చేసిన సమాచారాన్ని వార్నర్‌కి తెచ్చి ఇచ్చారు. అందులో ఉన్న సమాచారం చదివి చూశాడు వార్నర్. అదంతా ఈ ఉదయం తన టేబుల్ మీద ఉన్న కాగితాలలోని సమాచారమే. సో... సంతోష్ ఆజాద్ హింద్ ఫౌజ్ గూఢచారి అనటంలో ఎలాంటి అనుమానమూ లేదు.

ఆ విషయం ధృవీకరించుకున్న అతనికి మరుసటి రోజు తను ఏం చేయాలో కూడా స్పష్టమయిన అవగాహన వచ్చింది. తను ఏ విషయాలనయితే ఆజాద్ హింద్ ఫౌజుకు చేరవేయాలనుకుంటాడో అవే విషయాలని అధికారిక పత్రాలుగా చూపించి తన గదిలో పెడితే చాలు. సంతోష్ ఆ సమాచారం నిజమని నమ్మి దానిని ఆజాద్ హింద్ ఫౌజు వారికి పంపుతాడు. ఆ మాత్రం క్లూ దొరికితే వార్నర్ అల్లుకు పోతాడు.

మరుసటి రోజు సంతోష్ ఎప్పటిలానే పనిలోకి వచ్చాడు.

యధాప్రకారం వార్నర్ గదిలో టేబుల్ మీద ఉన్న కాగితాలను ఎవరూ గమనించకుండా చూడాలనుకున్నాడు.

మామూలుగా తను ఆ గదిలో ఉన్నంత సేపు కిటికీ దగ్గర నిలబడి తన మీద ఒక కన్ను వేసి ఉంచే సార్జంటు కూడా ఈరోజు దూరంగా ఉన్నాడు.

అందుకే ఏ భయం లేకుండా ఆ కాగితాలను తిరగేశాడు సంతోష్.

అవి చదువుతుంటే అతని భృకుటి ముడుచుకుంది. ఇంఫాల్, కోహిమాలో ఉన్న సైన్యాన్ని గణనీయంగా తగ్గిస్తున్న రిపోర్టులు అవి. అలా చేయటానికి కారణం కూడా ఆ రిపోర్టుల్లో స్పష్టంగా ఉంది. జపాను, ఆజాద్ హింద్ ఫౌజు సైన్యం సంఖ్యా పరంగా తమ కంటే అనేక రెట్లు ఎక్కువ ఉన్న కారణంగా ఎదురుబొదురు యుద్ధంలో వారిని గెలిచే అవకాశం లేదని, ఉన్న సైన్యాన్ని మైదాన ప్రాంతాలకు పిలిపించి మోహరిస్తే, శత్రువులు ఇక్కడ దాకా వచ్చినపుడు చూసుకోవచ్చని ఉంది ఆ రిపోర్టులో.

ఆ రాత్రికి ఆ సమాచారాన్ని ఆజాద్ హింద్ ఫౌజ్ హెడ్క్వార్టర్స్‌కు చేరవేశాడు సంతోష్.

కోహిమాలో ఉన్న అచింత్‌కు ఎక్కడ చూసినా వాహనాల్లో వెళ్లిపోతున్న సైనికులే కనిపిస్తున్నారు.

'వీళ్లంతా ఎక్కడకు వెళ్తున్నారు?' అనుకున్నాడు అచింత్.

కొంత ఎంక్వయిరీ చేయగానే వాళ్లు దిమాపూర్ వెళ్తున్నారని తెలుసుకున్నాడతను.

కోహిమా నుండి దిమాపూర్ 70 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. భారతదేశాన్ని కనెక్ట్ చేసే రైల్వే లైను అక్కడితో అంతమవుతుంది. అందుకే సైనికులు అక్కడకు వెళ్లి కలకత్తా వెళ్లే రైలు ఎక్కుతున్నారని విన్నాడు.

బ్రిటిషు సైన్యం కోహిమా నుండి వెనక్కి వెళ్తున్నారని అతను రిపోర్ట్ పంపాడు.

అలా ఎందుకు జరుగుతుందో ఆజాద్ హింద్ ఫౌజు అధికారులకు అర్థం కాలేదు. మరింతగా పరిశీలించి వారు నిజంగా వెళ్లిపోతున్నారా, లేదా అందులో ఏదన్నా వ్యూహం ఉందా అని కనుక్కోమని తిరుగు సందేశం వచ్చింది.

అది నిజమో, కాదో తెలుసుకోవటానికి దిమాపూర్ వరకు సైకిల్ తొక్కుకుంటూ వెళ్లాడతను.

నిజమే! కిక్కిరిసిన సైనికులతో నిండిన రైలు దిమాపూర్ నుండి కలకత్తా బయలు దేరి వెళ్లి పోయింది.

అచింత్ ఆ విషయం తిరిగి తమ హెడ్క్వార్టర్స్‌కి చేరవేశాడు.

"కదమ్ కదమ్ బడాయె జా
ఖుషీ కె గీత్ గాయె జా
యె జిందగీ హై కౌమ్ కీ
తూ కౌమ్ పే లౌటాయె జా

తూ షేర్–ఎ–హింద్ ఆగే బఢ్
మరనె సే తూ కభీ న డర్
ఉడా కె దుష్మనోం క సర్
జోష్–ఎ–వతన్ బడాయె జా..."

హిమ్మత్ తేరీ బడతీ రహే
ఖుదా తేరీ సున్‌తా రహే
జో సామ్‌నే తేరే ఖడే
తు ఖాఫ్ మే మిలాయె జా

చలో దిల్లీ పుకార్ కే
కౌమీ నిషా సంభాల్ కే
ఏ జిందగీ హై కౌమ్ కీ
తు కౌమ్ పే లౌటాయె జా…”

మిలటరీ బ్యాండ్ సంగీతం మధ్య సైనికుల గొంతు నుండి వెలువడుతున్న పాట నరాలను ఉప్పొంగిస్తోంది.

గౌరవ వందనం సమర్పించిన సైనికులు మార్చ్ చేసుకుంటూ వెళ్లి పోయారు.

సుభాస్ చంద్ర బోస్ తన జనరల్ కియానీతో, జపాను జనరల్ సాటోతో చర్చల్లో కూర్చున్నాడు.

“కలకత్తా నుండి అందుతున్న సమాచారం ప్రకారం బ్రిటిషు సైన్యం వెనక్కి తగ్గటానికి నిర్ణయించుకుంది…” చెప్పాడు కియానీ.

“నేను నమ్మను…” అన్నాడు బోసు.

“ఇంఫాల్, కోహిమాల నుండి సైన్యం వెనక్కి మరలిందని కూడా రిపోర్టులు వస్తున్నాయి.” చెప్పాడు జపాను జనరల్ సాటో.

“ఇవన్నీ టాక్టిక్స్. మీకు బ్రిటిషు వాళ్ళ గురించి తెలియదు. వాళ్లు తమకు లేని బలాన్ని ఉన్నట్లు బుకాయిస్తారు. ఉన్న బలం లేదని చూపిస్తారు. ఇలాంటి కుట్రలు, కుతంత్రాలలో వారు ఆరితేరిపోయారు…” బోసు ఆ రిపోర్టులను తేలిగ్గా తీసివేస్తూ అన్నాడు.

“శత్రువు బలహీనంగా ఉన్నపుడే దెబ్బ కొట్టాలి. ఇప్పుడే మనం మన సైన్యాన్ని ముందుకు నడపాలి…” ఆజాద్ హింద్ ఫౌజు మేజర్ జనరల్ కియానీ గట్టిగా వాదించాడు.

ఆ తరువాత చాలాసేపు చర్చ జరిగింది.

“మీ గూఢచారుల రిపోర్టులను మీరే నమ్మటం లేదా?” అంటూ ప్రశ్నించాడు సాటో.

“గూఢచారులను లొంగదీసుకోవటానికి అనేక మార్గాలు ఉన్నాయి. వచ్చిన ప్రతి రిపోర్టు నిజం అని నమ్మటానికి వీలు లేదు…” చెప్పాడు బోసు దృఢంగా.

"మరేం చేద్దాం అంటారు?"

"ఇప్పుడు వానా కాలం మొదలవబోతోంది. ఈశాన్య భారత దేశంలో వానలు ఎలా పడతాయో మీకు తెలియదు. త్వరపడి బాధపడే కంటే నాకు ఒక వారం సమయం ఇవ్వండి. మనకు వచ్చిన సమాచారం ఎంత నిజమయినదో నిర్ధారించుకుందాం..." అన్నాడు బోస్.

❦❦❦

కాసేపటి తరువాత బోస్ కెప్టెన్ లక్ష్మితో భేటీ అయ్యాడు.

"మన దేశం పూర్వ వైభవం పొందాలంటే అడ్డంకిగా ఉన్నది ఏమిటో తెలుసా?" అని అడిగాడు.

"బ్రిటిషు ప్రభుత్వం..." అంది లక్ష్మి. "వారి నుండి స్వాతంత్రం పొందితే..." అంటూ ఏదో చెప్పబోయింది.

"స్వాతంత్రం పొందితే ఏమవుతుంది లక్ష్మీ? ఏమీ కాదు. మన దేశం పురోగమించాలంటే నిర్మూలించవలసినవి మరో మూడు ఉన్నాయి. కులం, మతం, అవినీతి... అవి మూడూ నిర్మూలించనంత కాలం ఈ దేశం బ్రిటిషు వాళ్ల కింద ఉన్నా, స్వాతంత్రం పొందినా పెద్దగా తేడా ఉండదు." అన్నాడు.

"అది సాధ్యమంటారా?"

"చేయాలనుకునే రాజకీయ నాయకత్వం ఉంటే సాధ్యమే. నా నాయకత్వంలో మన దేశానికి స్వాతంత్రం వస్తే ఇలాంటి దురాచారాలను దేశం నుండి నిర్మూలించి చూపిస్తాను. దానికి అవసరమయిన ప్రణాళికలన్నీ నా దగ్గర ఉన్నాయి. కానీ ముందుగా చేయవలసింది స్వాతంత్రం కోసం పోరాడటం. దానికి నాకు నీ సహాయం కావాలి. ఇండియాకు కొంత మంది ఏజెంట్లను పంపాలి. మన దగ్గర సుశిక్షణ పొందిన ఏజెంట్లు ఎంత మంది ఉన్నారు?" అని అడిగాడు బోస్.

"వారు అక్కడ ఎలాంటి పని చేయవలసి ఉంటుంది?" అడిగింది కెప్టెన్ లక్ష్మి.

"పారాచూట్ల సాయంతో ఇండియాలో డ్రాప్ చేస్తాం. తరువాత రహస్యంగా వారికి అప్పచెప్పిన పని చేయవలసి ఉంటుంది. ఆ పని ప్రమాదకరంగా ఉంటుంది. ప్రాణాలకు గ్యారంటీ ఉండదు..."

నవ్వింది లక్ష్మి. "అలాంటి వాళ్ళు అయిదుగురు ఉన్నారు. వారికి మేం పెట్టుకున్న ముద్దు పేరు పాంచ్ పటాకా. వారు మీకు సరిగ్గా సరిపోతారు..." అని చెప్పింది.

"ఇంకొక గంటలో వారు నా ముందు ఉండాలి..." అంటూ సమావేశం ముగించాడు బోస్.

❦❦❦

ప్రస్తుతం...

కోహిమా వార్ మెమోరియల్ ఆవరణలో ఉన్నారు మయాంక్, కాంచనమాల. బర్మా నుండి క్రితం రోజు వారు కోహిమా వచ్చారు.

"నీవు ఇంటికి తిరిగి వెళ్లి ప్రశాంతంగా ఉన్నపుడు

ఒక్కసారి మమ్మల్ని గుర్తు తెచ్చుకో...

మీ సుందర భవిష్యత్తు కోసం

మా ప్రస్తుత వర్తమానాన్ని త్యాగం చేశామని గమనించు...”

వార్ మెమోరియల్ మొదట్లో శిలా ఫలకం మీద రాసి ఉన్న పై మాటలు చూసి కళ్లలో నీళ్ళు తిరుగుతుంటే, “సైనికుడు భారతీయుడయినా, బ్రిటిషు వాడయినా... ప్రాణం కోల్పోయింది మనుషులు.” అంది కాంచనమాల.

కాంచనమాల, మయాంక్ కోహిమా వచ్చి రెండు రోజులవుతోంది.

1420 శిలా ఫలకాలు నీటుగా పెంచిన లాన్ మీద కొద్ది కొద్ది దూరంలో అమర్చి ఉన్నాయి. ఆ ఫలకాల మీద చనిపోయిన వారి పేర్లు రాసి ఉన్నాయి. కొద్దిగా ఎత్తు మీద చనిపోయిన మరో 917 మంది హిందూ, సిక్కు సైనికుల గౌరవార్థం మరో మెమోరియల్ ఉంది.

కోహిమా నగరానికి మధ్యలో ఎత్తైన కొండ మీద ఉంది ఈ వార్ మెమోరియల్. అక్కడ నుండి చూస్తుంటే ఊరంతా అందంగా కనిపిస్తోంది.

“మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలలో కోట్లాది మంది భారతీయులు పాల్గొన్నారు. లక్షలాది మంది చనిపోయారు. కానీ ఇక్కడ కోహిమాలో తప్ప ఎక్కడా వారి గౌరవార్థం ఒక్క చిన్న కట్టడం కూడా బ్రిటిషు ప్రభుత్వం కట్టించ లేదు. పైగా సింగపూరులో ఆజాద్ హింద్ ఫౌజ్ కట్టిన కట్టాడాన్ని కూడా కూలగొట్టారు. ఒకప్పుడు ఇక్కడ టెన్నిస్ కోర్టు, డెప్యూటీ కమీషనర్ ఆఫీసు ఉండేవి. ఇక్కడే రెండు సైన్యాల మధ్య అతి భీకర యుద్ధం జరిగింది. అందుకే ఆ యుద్ధాన్ని టెన్నిస్ కోర్టు యుద్ధం అంటారు...” చెప్పింది కాంచనమాల.

“బర్మాలో ఆజాద్ హింద్ ఫౌజ్ మోహరించిన ప్రదేశం నుండి కొహిమా ఎంత దూరం ఉంటుంది?” అడిగాడు మయాంక్.

“సుమారు 300 కిలోమీటర్ల దూరం ఉంటుంది. దారి మొత్తం పర్వతాలు, అడవులతో నిండి ఉంటుంది. అందుకే ఈ దారుల్లో వచ్చి ఆక్రమణ చేయటం కష్టం. ఆక్రమణ చేయటానికి వచ్చే సైనికులను నిలువరించటం తేలిక.” చెప్పింది కాంచనమాల. ఆ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవటం వలనేమో, ఆమె మొహంలో కొద్దిపాటి గర్వం కనిపిస్తోంది.

“మేడమ్ మీరు 1944 ఏప్రిల్‌లో జరిగిన సంఘటనలను చెప్తున్నారు. అప్పటికి ప్రపంచ యుద్ధంలో మునిగి ఉన్న జపాన్, జర్మనీల పరిస్థితి ఎలా ఉంది?”

“రెండవ ప్రపంచ యుద్ధం మొదలయ్యాక 1941 లో జపాను, జర్మనీ రెండు తప్పిదాలు చేశాయి. పెర్ల్ హార్బర్ మీద దాడి అనే జపాన్ చేసిన తప్పు అప్పటి వరకు తటస్థంగా ఉన్న అమెరికాను యుద్ధంలోకి లాక్కు వస్తే, నిర్యుద్ధ సంధి ఉన్న సోవియట్ యూనియన్ మీదకు యుద్ధానికి వెళ్ళి జర్మనీ తప్పు చేసింది. దానితో అత్యంత బలవంతమయిన అమెరికా, సోవియట్ యూనియన్‌లు రెండవ ప్రపంచ యుద్ధంలోకి లాగబడ్డాయి. అప్పటి నుండి జర్మనీ, జపానుల బలం తగ్గుతూ వచ్చింది. మరో వైపు తమ అస్తిత్వమే ప్రశ్నార్థకమవటంతో బ్రిటిషు ప్రభుత్వం భారతీయులను ముందు వరుసలో

నిలబెట్టి యుద్ధం చేస్తోంది. దానికి సహకరించటానికి గానూ భారతదేశ రాజకీయ నాయకులకు యుద్ధం పూర్తి అవగానే స్వాతంత్రం ఇస్తామన్న తాయిలం చూపించింది. యుద్ధం బూచిని చూపించి పత్రికల మీద సెన్సార్‌షిప్ విధించింది. బోస్ చేస్తున్న ప్రయత్నాలను, కూడగడుతున్న సైన్యం వివరాలను ఏ పత్రికలలోనూ రాకుండా చూసింది. అసలే కరువుతో అల్లాడుతున్న దేశం నుండి తిండి గింజలను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమ సైనికుల అవసరాల కోసం తరలించింది. దానితో తీవ్రమయిన కరువు దేశాన్ని చుట్టు ముట్టింది. మరో వైపు అప్పటికే జర్మనీ సైన్యానికి సోవియట్ యూనియన్ తీవ్రమయిన నష్టం కలగచేసింది. జపాను నౌకా దళాన్ని అమెరికా టార్గెట్ చేసుకుంది. అలా అని బ్రిటిషు ప్రభుత్వ పరిస్థితి కూడా ఏమీ బాగాలేదు. ప్రతిరోజూ లండన్ నగరం మీద బాంబు దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడు ఇక్కడ ఇంఫాల్, కోహిమా నుండి జపాను సైన్యాన్ని భారతదేశంలోకి రానివ్వటం అంటే ఆత్మహత్యా సదృశ్యమని బ్రిటిషు వారికి బాగా తెలుసు. కాబట్టే... మొత్తం రెండవ ప్రపంచ యుద్ధానికి తుది అంకంగా ఇంఫాల్, కోహిమా నిలిచాయి." సుదీర్ఘంగా చెప్పింది కాంచనమాల.

"మరి అంత ముఖ్యమయిన యుద్ధానికి ఆజాద్ హింద్ ఫౌజు పూర్తిగా తయారయిందా?"

"ఒక్క దొంగ దెబ్బ తీయటంలో తప్ప, మిగిలిన అన్ని రంగాల్లో అప్పటికి జపాన్, ఆజాద్ హింద్ ఫౌజుల ఉమ్మడి సైన్యం పూర్తి ఆధిక్యంలో ఉంది. దాదాపు 84000 జపాను సైన్యం, 50000 ఆజాద్ హింద్ ఫౌజు సైన్యం భారతదేశంలోకి రావటానికి తయారుగా ఉంది. ఇంఫాల్, కోహిమాలలో ఉన్న మొత్తం బ్రిటిషు సైన్యం 15000 దాటదు. అసలు ఆజాద్ హింద్ ఫౌజు అనేది ఒకటి ఉందని భారత ప్రజలకు తెలియకుండా బ్రిటిషు ప్రభుత్వం మేనేజ్ చేస్తోంది. అటువంటి పరిస్థితులలో ఆజాద్ హింద్ ఫౌజు ఒకసారి మైదాన ప్రాంతాలలోకి ప్రవేశిస్తే, ఒకటికి పది మంది యువకులు తనకు మద్దతుగా సైన్యంలో చేరతారని బోసు సంపూర్ణంగా విశ్వసించారు. అలాంటి పరిస్థితులలో ఆధిక్యం ఎవరి పక్షాన ఉందో నువ్వే నిర్ణయించుకో..."

"కానీ, చివరకు ఫలితం మాత్రం..."

"చెప్పానుగా మయాంక్. యుద్ధంలో సైనికులు ఎక్కువ ఉన్నవాడే గెలవాలని రూలేం లేదు."

"ఆ రోజు సుభాస్ బోస్ గారు మిమ్మల్ని పిలిపించుకున్నారు కదా. మీరు ఆయన్ని కలిశారా?"

"ఆయన పిలిచాక ఎవరయినా కలవకుండా ఉంటారా"

"అలాంటి మహానుభావుడిని ప్రత్యక్షంగా చూసిన మీరు అదృష్టవంతులు. మిమ్మల్ని నేను కలుసుకోవటం నా అదృష్టం..."

నవ్వింది కాంచనమాల.

"ఇంతకీ మిమ్మల్ని ఆయన ఎందుకు పిలిపించారు?" అడిగాడు మయాంక్.

గొంతు సవరించుకుంది కాంచనమాల.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS